# వాన రోజు ఆలోచనలు

వాన! వాన! వాన! ఒకటే వాన. రాక రాక కొత్త ఊరు వచ్చిన ఏడుకొండలు విసుగెత్తిపోయాడు. పదిహేను రోజులౌతోంది. విడవకుండా కురుస్తోంది. ఇలా అలా కాదు. కుండపోతగా. కాస్త విరామం దొరికితే చాలు తడిసి బరువెక్కిన రెక్కలు విదిలించుకొని కావుకావుమంటున్నాయి - ఇళ్ళ మీద కాకులు. అంత వాన ఆ ప్రాంతంలో ఎన్నడూ ఎరగరట. ఆకాశంలో ఇన్ని నీళ్ళు ఎక్కడున్నాయా అని ఆశ్చర్యంతో మీదికి చూస్తున్నాడు. ఉన్న ఊళ్ళో, సాయంత్రం రోజూ ఐదు మైళ్ళు కనీసం నడిచే అలవాటు. ఇక్కడ చిన్న కొడుకు అద్దెకు ఉంటున్న ఇంట్లో కూర్చుంటే కాళ్ళు రెండూ కట్టి ఖైదు చేసినట్లుంది. వాన ఒక అర్ధగంట పాటు తెరిపిచ్చినా ఆ ఇంటి చుట్టూ ఇటూ అటూ నాలుగడుగులు వేసి తృప్తిపడడం మినహా ఏమీ చెయ్యలేని పరిస్థితి. తిరిగి తన ఊరు వెళ్ళిపోదామా అంటే చిన్న కొడుకుని ఏదో ట్రెనింగ్ కని ఫ్యాక్టరీ యాజమాన్యం పదిహేను రోజులు ముంబాయికి పంపింది. వాన తగ్గు ముఖం పట్టనిదే అసలు ప్రయాణమే అసాధ్యం. దారులు గండ్లుపడి వాహనాల రాక పోకలే సరిగ్గా జరగడంలేదు.

ఇంట్లో ఏ కూరలూ లేవనీ, సబ్జి బండీ ఇళ్ళకు రావడంలేదనీ ఉదయాన్నే కోడలు విసుక్కొంటోంది. వాన కాసింత తగ్గగానే చొరవచేసి రోడ్డు మీదకు పోయి

కుడిచేతి వేపున్న సందులోకి చూస్తే చిన్న అంగడి కనపడింది. వంకాయలు. వాడిపోయిన చిక్కుళ్ళూ ఒక అరుగుమీద పెట్టుకొని ఎవడో అమ్ముతున్నాడు. ఉన్నంతలో ఎంపిక చేసి ఒక అరకిలో తెచ్చి కోడలికిచ్చాడు.

వాలు కుర్చీలో కూర్చొని ఏదో పాత పుస్తకం చదువుతుంటే కళ్ళు మూతలు పడి చిన్న కునుకుపట్టేసింది.

"ముగ్గురు పిల్లల్ని కనిపెంచి పెద్దచేశారు మా నాయన గారు - అని మీ బావగారు అంటూ వుంటారు. అర కిలో వంకాయలు తెస్తే అందులో రెండు పుచ్చివి" కోడలు పిల్ల మాటలు చెవిని పడుతున్నాయి. సహాయంగా వచ్చిన చెల్లెలితో అంటున్న ఆ మాటలు చెవిని సోకిన తర్వాత ఎందుకో కోపం రాలేదు. చిన్నగా నవ్వుకొన్నాడు. ఒకే సంఘటనకు ఇద్దరు స్త్రీలు ఎలా స్పందిస్తారు అన్న ఆలోచన ఏడుకొండల్ని గతంలోకి తీసుకుపోయి గతించిన భార్యను గుర్తుకు తెచ్చింది.

"మనం కాయలు ఎంపిక చేయ్యడం అమ్మేవాడికి ఇష్టం ఉండదు. ఎంపిక చేసి తూకానికి పళ్లెంలో వేస్తే కాస్త ఎక్కువ తూగాయి - అని ఒక పెద్ద కాయను తీసేసి రెండు పుచ్చికాయలు వేసి హడావిడి చేసేస్తాడు. వాడి ఆశ వాడిది. అలా పుచ్చికాయల్ని చెల్లకొడతాడు" అని అనుభవంతో వివరించేది. పురుగు సోకిన భాగాన్ని తరిగి పారేసి మంచిగా ఉన్న భాగాన్ని వండేది.

సంసార పక్షపు ఆలోచన అది. ముగ్గురు కోడళ్లలోనూ నేనే కాస్త ఉన్న ఇంటి నుండి వచ్చిన దాన్ని అనే అహంతో పలికిన చిన్న కోడలి మాటలివి - ఇంకా పిల్లలూ బాధ్యతలూ ఎరగని పిల్ల.

ఎలిమెంటరీ స్కూల్లో ఉపాధ్యాయుడుగా అడుగుపెట్టి ఉన్నత పాఠశాలలో పాఠాలు చెప్పేలా ఎదిగి పింఛను తీసుకొంటున్న ఏడుకొండలుకు ముగ్గురు కొడుకులు. పెద్దవాడు కువాయిట్‌లో ధనార్జనకు వెళ్లిపోయాడు. రెండోవాడు తాను రిటైర్ అయిన గ్రామంలో మున్సిఫ్ ఆఫీసు గుమస్తాగా కొనసాగుతున్నాడు. చిన్నకొడుకు కాసింత మంచి ఉద్యోగమే భివండీలో పెద్ద ఫ్యాక్టరీలో సంపాదించాడు.

అలా ఏడుకొండలు ఎరిగిన ఊళ్ళో కోడలు పెట్టిన భోజనం చేసి మధ్యాహ్నం కాసింత నిద్రపోతాడు. ప్రక్కింటి సుబ్బయ్యతో ఒక గంట చదరంగం ఆడుకొంటాడు. సాయంత్రం అలా చేల గట్టంట నడిచి వస్తాడు. ఇరుగు పొరుగు పిల్లల్ని మనవడితో కలిపి ఒక కథ చెప్తాడు. ఇలాటి దిన చర్యతో ఇక కాలం గడపడమెలా అన్న బాధ ఎరగడు. రెండో కోడలు పొందికైన పిల్ల. చక్కగా సంసారం దిద్దుకుంటోంది. చిన్న కోడలి మాటలు విన్నాక ఇది వరకు రాని ఆలోచన ఒకటి మనసులో మెదిలింది. పిల్లలకు రెక్కలొచ్చాయి. వాళ్ళ బ్రతుకులు సరిచూసుకో గలుగుతున్నారు. కాళ్ళూ చేతులూ స్వాధీనంలో ఉండగానే ఇక నిశ్చింతగా వెళ్ళిపోతేనే నయం. ఇక ఏమి బాధ్యతలు మిగిలి ఉన్నాయి గనక? అనుకున్నాడు.

భుక్తాయాసం తీరాక చిన్న కునుకు పట్టింది. సాయంకాలం ఐదుగంటల వేళ లేచాడు. ఇంటి పై కప్పు మీద పడుతున్న వాన చినుకుల శబ్దం లేదు. చూరు నుండి కిందకు జారే నీటిధార సద్దు కూడా లేదు. కిటికీలోంచి బయటకు చూశాడు. కాసింత నీరెండపొడ కనుపించింది. బడి పిల్లలకు ఆటవిడుపు దొరికినంతగా ఏడుకొండలు సంతోషించాడు. ఆ వీధిలోని పిల్లలు ఇళ్లలోంచి బయటపడి సందడి చేస్తున్నారు. తాను కూడా కాసింత కాళ్లూ చేతులూ కదిలించి మనసుతీరా నడిచి రావాలని నిశ్చయించాడు. శాలువ తల మీంచి కప్పుకొని చెప్పులు కాలికి తొడుగుతున్నాడు.

తెలిసిన రోడ్డుమీదే పోయి వెనక్కు వచ్చేయండి. దారి తప్పితే ఇక్కడి భాష కూడా రాదాయె, మీ అబ్బాయి ఊళ్ళోలేరు - అని హెచ్చరించి కోడలు తలుపు వేసుకొంది. అలవాటు కొద్దీ ఒక అరగంట తెలిసిన రోడ్డు పట్టి తిన్నగా నడిచాడు. ఇక వెనక్కు మళ్లాలని అనుకుంటూ వుండగానే దడదడమని పెద్ద వర్షపు జల్లు వచ్చింది. నడిచే ఉత్సాహంలో మూసుకొస్తున్న నీటి మబ్బు వేపు ధ్యాస లేకపోయింది. తడుసుకుంటూ వెళ్లిపోవచ్చుకానీ ఇంటి నిండా ఆరని తడిబట్టలు ఉన్నాయి. నిండా తడిసిన బట్టలతో వెళ్తే కోడలు పిల్ల విసుక్కోవచ్చు. దగ్గరగా ఏ అరుగూలేదు. ఎత్తైన ప్రహరీగోడలు తప్ప. కాసింత దూరాన అక్కడ ఒకే ఒక చిన్న నీడ, బస్సు ప్రయాణీకుల కోసం కట్టినది కనిపించింది. సిమ్మెంటు రేకులతో కప్పి ఉంది. అందులో ముగ్గురో నలుగురో మనుషులున్నారు. అందులోకి పోయి

తలదాచుకొన్నాడు. పది నిముషాలు దాటింది. పావుగంట అయింది. వాన తగ్గే సూచనలు లేకపోగా జల్లు ఎక్కువైంది. ఉన్న మనుషులు మరింత వెనక్కు వచ్చి దగ్గరగా జరిగారు. ఒక యువకుడు చేతి గడియారం చూసుకొని తెగించి వానలో తడుస్తూ వెళ్ళిపోయాడు. ఇద్దరు మాత్రం మరాఠీ భాషలో స్థానిక రాజకీయాలు కాబోలు ముచ్చటించుకొంటున్నారు.

ఏడుకొండలకి కాసింత ముందుగా ఒక స్త్రీ నిలబడి వర్షధార వేపు ఆందోళనగా చూస్తోంది. వయసు ఏభై పై మాటే. చేతిలో సుమారు రెండేళ్ళ ప్రాయపు పసిబిడ్డ. ఆ చిన్నది ఆమెను హత్తుకొని చుబుకం భుజం మీద ఆనించి ఏడుకొండలు వేపే చూస్తోంది; విశాలమైన నుదురు, తుమ్మెదల్లాంటి నల్లటి కళ్ళూ మొహంలో స్పష్టంగా కనిపస్తున్న నీరసం. వీధి దీపం జల్లుతున్న సన్నని వెలుగులో ఆ పాపను తదేకంగా చూస్తున్న ఏడుకొండలుకి, ఏనాడో బాలారిష్టంతో నాలుగేళ్ళ ప్రాయంలో పోయిన తొలి చూలు గుర్తొచ్చింది. బ్రతికుంటే ముగ్గురు కొడుకులతోపాటు తనకో బిడ్డ ఉండేది - అనుకున్నాడు. ఆ పాప కళ్ళలోకి చూస్తూ పలకరింపుగా కనుబొమ్మలు ఎగురవేశాడు. చిరు పెదవుల మధ్య నుండి చిన్నగా నవ్వు వొలికించింది.

'ఏం వానరా నాయనా' అని గట్టిగానే అలవాటు చప్పున తన విసుగుదలను వినిపించిన ఏడుకొండలు వేపుకి తిరిగిన ఆ స్త్రీ - 'బాబూ! తెలుగోరా మీరు' అంది. ఆమె కొప్పుముడి, ముక్కుకు మధ్యగా ఉన్న నత్తు చూస్తూనే ఉత్తరాంధ్ర ప్రాంతం మనిషిగా ఏడుకొండలకి తోచింది.

అవును, ఇక్కడ నా కొడుకూ కోడలూ ఉంటే చూడాలని వచ్చాను. వచ్చిన రోజు నుండీ ముసురు పట్టింది - అన్నాడు. ఆమె ఏదో చెప్పాలనీ, చెప్పలేక సందేహిస్తున్నాదనీ మొహంలోని ఆందోళన చూసి గుర్తించాడు ఏడుకొండలు.

ఆ దేవుడే పంపినట్టొచ్చారు - అంటూ ఆగిపోయింది.

ఆమెను చూస్తే సామాన్యంగా కనపడింది కానీ శ్రీమంతుల వేషభాషలు లేవు. ఏదో ధన సహాయం అడగబోతుందేమో జేబులో కాసైనా లేకుండా వచ్చేశాను అని జేబు తడుముకొని కించపడిపోతున్నాడు.

'ఒక్క సిటం ఈ పాపని పట్టుకొంటే చాన. నేనిప్పుడే వచ్చీసి అందుకుంతాను' అని ప్రాధేయపడింది ఆమె. వయసు మళ్ళిన ఆమె అవసరమేదో కొంత ఊహించగలిగాడు. రెండు చేతులూ సాచాడు. ఆ పాప కొత్త మనిషి దగ్గరకు రాకుండా మారాం చేస్తుందేమో అని అనుకొన్నాడు. కానీ, అతని మెడను రెండు చేతులతో చుట్టి పొందికగా చేతుల్లో ఇమిడిపోయింది. అలా గుండెల మీద పసిపిల్లను వేసుకోగానే ఏదో తృప్తి మనసంతా నిండిపోయింది.

ఇంతలో వానలోకి పోయిన స్త్రీ పరుగులాంటి నడకతో వచ్చేసింది. తడిసిన చీరకొంగు గట్టిగా పిండుకొని, మీద పడ్డ నీళ్ళు విదిలించుకొని తిరిగి ఆ పసిపిల్లను భద్రంగా అందుకొంది. ఆమె మొహంలో ఇది వరకున్న ఆందోళన లేదు.

"ఇది నా మనుమరాలు. నా కూతురు బిడ్డ. పదిరోజులు జొరంతో మెత్తబడిపోయింది కానీ లేకుంటే ఎంత కష్టమున్నా ఏడవదు. రెండు రోజులైంది జొరం తగ్గి నిమ్మళమైంది. వైద్యుడికి చూపించి వస్తున్నాను. దీన్ని ఇంత వానలో తడిపితే ఎలాగని బెంగెట్టీసుకున్నాను. ఎల్లక తప్పని అవసరమాయె....." క్షమాపణగా చెప్పుకుపోతోంది.

ఇప్పుడు తడవకుండా ఇంటికెట్లా వెళతారు? అని అడిగాడు ఏడుకొండలు.

"ఇక్కడికి మా ఇల్లు ఎంతో దూరం లేదు. ఇప్పుడు నా కూతురొస్తాది. నన్నిక్కడే ఉండమన్నాది. అందుకే సూస్తున్నా బాబూ......"

'నీ కూతురేం చేస్తుంది?'

"ఏం చెప్పను బాబూ! అల్లుడూ కూతురూ బాగానే బతికేటోళ్ళు. రోడ్డు ప్రమాదంలో అల్లుడు పోయి నాలుగు నెలలైపోయింది. ఆఫీసు వాళ్ళు జాలిపడి కూతురుకి చిన్న ఉద్యోగం అదే ఆఫీసులో ఇప్పించారు. ఇప్పుడు అక్కడి నుంచే రావాల. దానికి నేనే దిక్కు. నాకెవలూ లేరు..... కళ్ళు వత్తుకుంది.

వాన ఒత్తిడి తగ్గి తుంపరగా మారింది. రాజకీయాలు ముచ్చటించే ఇద్దరూ వాళ్ళ దారిన పోయారు. అక్కడ ఇక మిగిలిన ఇద్దర్నీ విడిచి రాలేక సంకోచిస్తూ అడిగాడు ఏడుకొండలు.

కూతురు వయస్సెంత?

"ఇరవైమీద ఒకటో రెండో..."

'అయ్యో పాపం! అమ్మాయికింకా ముందుంది జీవితం. మనం బ్రతికేదెన్నాళ్లు? ఆమెకి ఇష్టమైతే పెళ్ళి చేయడమే మంచిది కాదూ?' ఇంతలో వాన వెలిసింది. గొడుగు వేసుకొని వచ్చిన అమ్మాయిని చూశాక కళ్ళు చెమ్మగిల్లాయి. ఇంత చిన్న పిల్లకి ఎంతటి కష్టం, ఎంత బాధ్యత - అనుకొన్నాడు ఏడుకొండలు మనసులోనే.

కూతురికి పసిపిల్లను అప్పగించి, ఆమె చేతిలో గొడుగును అందుకొని వెళ్ళబోయింది ముసలామె.

'లోకం చల్లగుండాలంటె మరి నీలాంటోళ్లు బతకాలి బాబూ!' అని దండం పెట్టింది.

ఇంటిదారి పట్టాడు ఏడుకొండలు. మధ్యాహ్నం మనసులో చోటు చేసుకొన్న నిర్వేదం ఆవిరైపోయింది. ఓ మంచి మాటకైనా చేతకైనా శరీరం ఉంటేనే కదా అనుకొన్నాడు.

2006